ప్రజాశక్తి

గురువారం 7 డిసెంబర్ 2023 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



అరటి తోట నేలమట్టం

ఉద్యాన పంటలు అతలాకుతలం

- నేలకూలిన అరటి, బొప్పాయి
- 80 శాతానికిపైగా దెబ్బతిన్న మిర్చి, మామిడి

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి: మిచౌంగ్ తుపాను ఎన్టీఆర్ జిల్లాలో బీభత్సం సృష్టించింది. ఉద్యాన పంటలను అతలాకుతలం చేసింది. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లోని పంటలను నీట ముంచింది. అరటి, బొప్పాయి, పసుపు, మిర్చితో పాటు కూరగాయలు తదితర పంటలు అధిక శాతం నీటిలో మునిగిపోయాయి. ఎడతెరప లేని వర్షాలు, ఈదురు గాలుల వల్ల అరటి, బొప్పాయి చెట్లు పడిపోయాయి. జిల్లాలో మేజర్ ఉద్యాన పంటలైన మామిడి, మిర్చి పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. వేలాది రూపాయలు (మిగతా 6లో)

కన్నీరే మిగిలింది!

- మొలకలొస్తున్న వరి కంకులు
- తడిసిన ధాన్యం బస్తాలు



తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మిచౌంగ్ తుపాను రైతులకు కన్నీరే మిగిల్చింది. మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు రైతులను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. మూలిగేనక్కపై తాటిపండు పడిన చందంగా రైతుల పరిస్థితి మారిపోయింది. లక్షలు ఖర్చు పెట్టుబడి పెట్టిన పంట కళ్లెదుటే నీటిలో నానుతుండటాన్ని చూసి రైతులకు కన్నీరు పెట్టుకుంటున్నారు. పంటల సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. కృష్ణాజిల్లాలో అత్యధికంగా 3.74 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసిన ఒక్కో రైతుది ఒక్కో వ్యథ.

గూడూరుకు చెందిన వీరంకి వీరమ్మ కౌలుకు చేస్తున్న నాలుగు ఎకరాల్లో వెద పద్ధతిలో వరి వేయగా జులైలో కురిసిన వర్షాలకు నీట మునిగిపోయింది. కుళ్లిపోయింది. పొలం తిరిగి దమ్ము చేసి రూ.20 వేలు ఖర్చు పెట్టి 20 సెంట్లు నారు కొనుగోలు చేసి నాట్లు వేశారు. ఎకరాకు రూ.35 వేలు చొప్పున మొత్తం రూ.1.40 లక్షలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టారు. తుఫానుకు వరి పంట నేలవాలింది. నీటిలో నానుతున్న వరి పొలాన్ని చూసి గట్టుమీద కూర్చుని నష్టాన్ని (మిగతా 6లో)



మొలకెత్తిన ధాన్యం



సిఎం శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నేడు దుర్గగుడిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సిఎం రాక సందర్భంగా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రానున్నారు. దేవస్థానంలో రూ.216.05 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులను ఉదయం 8.45 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేశఖండనశాల, గోసాల విస్తరణ, సెల్లార్‌లో సామూహిక కల్యాణాలు, గ్రౌండ్ ఫ్లోర్లలో లాకర్స్ సదుపాయం, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లలో డార్‌మెటరీ ఏర్పాట్లు, కారు పార్కింగ్ తదితర అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, డిసిపి విశాల్ గున్ని, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కె.ఎస్. రామారావు పాల్గొన్నారు. సిఎం పర్యటన సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి, కనకదుర్గా నగర్ వద్ద సిబ్బందికి సూచనలు చేశారు.

నిండా మునిగాం...

- సిపిఎం బృందం ఎదుట రైతులు, కౌలు రైతుల ఆవేదన
- కృష్ణాజిల్లాలోని పలు మండలాల్లో పర్యటన



తడిసిన వరిని చూపుతున్న రైతు



మోపిదేవిలంకలో రైతులతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

వ్యవసాయ పనులు చేసుకుని బతికేటోళ్లం... అంతో ఇంతో మిగులుతుందని పొలాలు కౌలుకు తీసుకున్నాం. మా ఊళ్లో 80 శాతం భూములు కౌలు రైతులమే పండిస్తున్నాం... వరి పంటకు ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టాం. కోత కోసి పనలపై ఉన్న పంటలే కాదు.. కొద్ది రోజుల్లో కోయాల్సిన పంట నేలవాలిపోయింది. పంటకు పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు పాలవుతున్నామని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లాలోని మొవ్వ మండలం నిడుమోలు శివారు వీరాయలంక, మోపిదేవి మండలం మోపిదేవి లంక గ్రామాల రైతులు, కౌలు రైతులు సిపిఎం బృందం ఎదుట వాపోయారు. వీరాయలంకకు చెందిన కౌలు రైతు దేవరకొండ శ్రీనివాసరావు తాను కౌలుకు చేస్తున్న ఐదు ఎకరాలు, బొర్రా చంద్రశేఖరరావు తన 97 సెంట్లు భూమిలోని పనలు నీటిలో నానుతున్నాయని వాపోయారు. వరి పొలం నేలవాలిందని సాధారణంగా ఎకరం కోతకు రూ.4 వేలు ఖర్చేయ్యేదని పంట నేలవాలడంతో రూ.10 వేలు ఖర్చవుతుందని, ఇంత ఖర్చు పెట్టినా ఎంత పంట చేతికి వస్తుందో..ఎంత ధరకు కొంటారో తెలవడం లేదని కొనకళ్ల రాంబాబు తదితరులు కృష్ణాజిల్లాలో పర్యటించిన సిపిఎం బృందం ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ... పూర్తి వార్త 6వ పేజీలో

నివాళి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

వినతి



పెనుగంచిప్రోలులో అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే గొప్ప స్ఫూర్తి అని, నాటి సమాజంలోని అంటరానితనం, వివక్షతల పై అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఈ సందర్భంగా కొనియాడారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గ్రాట్యూటీ చెల్లించాలని, ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చారు. ... వార్తలు లోపలి పేజీల్లో

నేడు గవర్నర్ నజీర్ పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ డిల్లీరావు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరగనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలోఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు బుధవారం సాయంత్రం కళాక్షేత్రంలో అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమ వేదిక, పారిశుధ్యం, వైద్య శిబిరాలు, అగ్ని మాపక, తాగునీరు, పార్కింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు సూచనలిచ్చారు.

చెట్టు కూలి ఇల్లు ధ్వంసం



చెట్టు ఇంటిపై పడిన ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్ సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాతబస్తీలోని 50వ డివిజన్‌లోని గొల్లపాలెం గట్టు వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న వేప చెట్టు కూలడంతో రేకుల ఇల్లు ధ్వంసం అయింది. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రమాద వివరాలను, స్థానిక పరిస్థితిని తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ ఉద్యాన శాఖ అధికారులకు, రెవెన్యూ తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. కొండ చర్యలు, రిటర్నింగ్ వాల్స్, చెట్లు ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో కొండ ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రమాదకరంగా, ఇబ్బందికరంగా ఉన్న నివాసాల ప్రజలు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని వివిధ మాధ్యమాలలో తెలియచేశారు. సత్యబాబు వెంట డివిజన్ సిపిఎం నాయకులు పి.రాజు, సిఐటియు నాయకులు బి.దుర్గారావు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో పర్యటించిన పశ్చిమ తహశీల్దార్ పి.జాహ్నవి



ఇంటిని పరిశీలిస్తున్న జాహ్నవి

మిచౌంగ్ తుపాన్ ముగిసిన అనంతరం బుధవారం విజయవాడ పశ్చిమ తహశీల్దారు పి.జాహ్నవి కొండ ప్రాంతాల్లో ఆస్తి నష్టం జరిగిన ప్రదేశాలు సందర్శించారు. ఇందులో భాగంగా గొల్లపాలెం గట్టు కొండ పైన వెంపాడ గుర్రమ్మ భర్త వెంపాడ ఆది (6-14-1) ఇంటిపైన పై వరుసలోని వేప చెట్టు మంగళవారం రాత్రి గాలి వానకు కూలి పడటంతో ఇంటిపై రేకులు పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. తహశీల్దారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి కొండపై నివాసితులను అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. **భవానీపురం :** పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్ పరిధిలో 300, 450 ఎస్‌ఎఫ్‌టి వెలంపల్లి కాలనీలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి ఇళ్ళల్లోకి డ్రైనేజీ నీటితో పాటు వర్షం నీరు చేరిపోయాయి. విషయం తెలుసుకున్న టిడిపి మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య బుధవారం సంఘటనా స్థలానికి చేరుకుని వర్షం వల్ల ఎర్రమట్టితో పేరుకుపోయిన ఇళ్లను శానిటరీ ఇన్స్పెక్టర్ బ్రహ్మారెడ్డికి చూపిస్తూ సమస్యను వివరించారు. శానిటేషన్ అధికారులు పిలిపించి బ్లాక్స్ మధ్య వర్షపు నీటిని క్లీనింగ్ చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు, స్థానికులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సీతా చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఇంట్లోకి నీరు వచ్చిన ప్రాంతాన్ని చూస్తున్న రామయ్య

హెచ్‌బీ కాలనీలో మహేష్ పర్యటన



వర్షం నీటిని చూస్తున్న మహేష్

వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను జనసేన పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ పోతిన వెంకట మహేష్ బుధవారం ఉదయం పర్యటించారు. స్థానిక 42వ డివిజన్ పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూషతో కలిసి ఆయన 42, 43 డివిజన్లలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, చిన్న వర్షం పడితే ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సమస్యలపై అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మహేష్ చెప్పారు.



చంద్రర్లపాడులో



ఎ.కొండూరులో



మైలవరంలో

నేలవాలిన పంటలు

కష్టపడి, వేలల్లో లక్షల్లో పెట్టుబడి పెట్టి పంట చేతికి వస్తుందని ఆశతో ఎదురు చూస్తున్న సమయంలో మిచౌంగ్ రూపంలో వచ్చిన తుపాను పంటను మింగేసింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. వరి, పత్తి, మిరప చేలు నీట మునిగాయి. వరి ముక్కిపోతుందని, ఒడ్లు మొక్కలొస్తాయని, పత్తి నల్లబడుతుందని, మిరప సైతం నలుపొస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే బయట అప్పులు తెచ్చి మరీ పంటలు పండించుకున్నామని ఇప్పుడు ఈ వర్షంతో సర్వం కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏ చేలో పంట చూసినా నేలను వాలిపోయి కనిపిస్తుంది. నష్టపోయిన రైతులకు న్యాయబద్ధంగా అంచనా వేసి పంటలకు నష్టపరిహారమివ్వాలని, రైతు సంఘాల నాయకులు, సిపిఎం, ఇతర పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నీటమునిగిన పంటను బుధవారం పలు పార్టీల నాయకులు, వ్యవసాయాధికారులు పరిశీలించారు.

ప్రజాశక్తి - మైలవరం : మీ చాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. తుఫాన్ వల్ల నేలకొరిగిన పంటలను బుధవారం రైతు సంఘం నాయకులతో కలిసి చంద్రగూడెం, పుల్లూరు, వెల్వడం గ్రామాలలో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులను ఎంత నష్టపోయారో వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, పలువురు రైతులు పాల్గొన్నారు. **ఎ.కొండూరు :** మండలంలో రైతులు 5 వేల ఎకరాల్లో పత్తి, 6వేల ఎకరాల్లో వరి, 4500 ఎకరాల్లో మిర్చి సాగుచేశారని తెలిపారు. **పెనుగంచిప్రోలు :** దెబ్బతిన్న పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని ముచ్చింతాల, గుమ్మడి దురు, అనిగండలపాడు, వెల్దుర్తి పాడు గ్రామంలో పంటలను పరిశీలించి మాట్లాడారు. **ఇబ్రహీంపట్నం :** వరి, మొక్కజొన్న ,పత్తి, మిరప , కూరగాయలు నీట మునిగాయి. పంటలను బుధవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపియం మండల కార్యదర్శి యం మహేష్ మాట్లాడారు. **వత్సవాయి :** మిర్చి పత్తి వరి, వేసిన రైతులకు పంటలను నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, కౌలు రైతుల సంఘం నాయకులు టి.రమేష్ డిమాండ్ చేశారు. పాలంపల్లిలో పంటలను పరిశీలించారు. **తిరువూరు :** రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు ఎస్‌వి.భద్రం, బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, రైతు సంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తిరువూరు దేవసముద్రం ఆయకట్టు కింది, మండలంలోని లక్ష్మీపురంలో నేటి మునిగిన పంటను బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు. రైతులను ఆదుకోవాలని టిడిపి తిరువూరు నియోజక వర్గ ఇన్చార్జ్ సేవల దేవదత్తు, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురంలో నీటమునిగిన వరి పంటను వారు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. రైతుల పొలాలను జనసేన నియోజకవర్గం సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు, లింగనేని సుధాకర్ ఉయ్యూరు జయప్రకాష్ పరామర్శించారు. అనంతరం ఆర్‌డిఒను పరిహారం అందించాలని కోరారు. **విస్సన్నపేట :** పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ మండల డిప్యూటీ తహశీల్దార్ మోతియాకు జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. **నందిగామ :** నందిగామ ప్రాంతంలో మిచౌంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న వరి, మిర్చి, ధాన్యం పంటలకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం అందజేసి బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నందిగామ మండలం పల్లగిరి, మాగల్లు, దాములూరు, కంచల, రాఘవాపురం, కమ్మవారిపాలెం తదితర గ్రామాల్లో అకాల వర్షాలు వల్ల దెబ్బతిన్న మాగాణి, పత్తి, మిర్చి తదితర పంటలను నాయకులు పరిశీలించారు. **గంపలగూడెం :** రైతులకు అపార నష్టం జరిగిందని మండలం బహుజన సమాజ్ వాది (బిఎస్‌పి) ఇన్చార్జి లెక్క పోగు వందనకుమారి పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పత్తి, మిరప, మొక్కజొన్న, వరి, తదితర అన్నిపంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు వివరించారు. **రెడ్డిగూడెం :** రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మాధవరెడ్డి కోరారు. వేసిన వరి పంట 40 శాతం వరకు ఎండలకు ఎండిపోయిందని, మిగిలిన పైరు కోత దశలో ఉండగా ఈ తుఫానుపాలైందని అన్నారు. **చందర్లపాడు :** పంట పొలాలను కౌలు రైతుల సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షుడు జి.ఏడుకొండలు మాట్లాడారు. పత్తి, మిర్చి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. **జగ్గయ్యపేట :** రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌సి.హెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం జగ్గయ్యపేట మండల నాయకత్వం మండలంలోని షేర్ మహమ్మద్ పేట, రామచంద్రుని పేట, అనుమంచిపల్లి గ్రామాల్లో పర్యటించింది. ఈ బృందంలో సిపిఎం జగ్గయ్యపేట మండల కార్యదర్శి ఎస్ నాగమణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అనుమంచిపల్లి, రామచంద్రుని పేట, షేర్ మహమ్మద్ పేట గ్రామాలలో తుఫాన్ వలన తడిసిన ధాన్యాన్ని, నేలరానిన మొక్కజొన్న, వరి పొలాలని తెదేపా నేతలతో కలిసి టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా పంట నష్టం అంచనా వేసి నివేదిక పంపించడం జరిగింది. మండలంలోని 24 గ్రామాలలో వరి పంట 1200 ఎకరాలు, మొక్కజొన్న 200 ఎకరాలలో అధిక వర్షం వలన నేల వాలిందని నివేదికపై అధికారులకు పంపినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.



కంచికచర్లలో



జగ్గయ్యపేటలో



రెడ్డిగూడెంలో



పెనుగంచిప్రోలులో



ఇబ్రహీంపట్నంలో



విస్సన్నపేటలో ఎంఆర్‌ఒకు వినతిపత్రం



వత్సవాయిలో



తిరువూరులో



నందిగామలో

ఎవరూ అధైర్యపడొద్దు : సామినేని



పంటలను పరిశీలించి మాట్లాడుతున్న సామినేని

పెనుగంచిప్రోలు : మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని కొనకంచి గ్రామంలో నీట మునిగిన పంటలను బుధవారం వ్యవసాయ శాఖాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం బాధిత రైతులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. 15 వేల ఎకరాల్లో వరి పంట వేస్తే ఐదు వేల ఎకరాలు పూర్తిగా నీటమునిగాయని తెలిపారు.

21 వ వార్డులో తుపాన్ సహాయక చర్యలు

ఇబ్రహీంపట్నం: మిచౌంగ్ తుపాన్ ధాటికి కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో పశ్చిమ ఇబ్రహీంపట్నం 21వ డివిజన్ పరిధిలో తుఫాన్ దాటికి సి కాలనీ వైపు ఉన్న పెద్ద పెద్ద చెట్లు పశ్చిమ ఇబ్రహీంపట్నం ఎస్సీ కాలనీ వైపున్న ఇళ్ల మీద పడ్డాయి. విషయం తెలుసుకున్న టీడీపీ కొండపల్లి మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రావి ఫణి, జెల్లీ కాంతారావు ఆధ్వర్యంలో ఇళ్ల మీద పడ్డ చెట్లను తొలగించారు. రెవిన్యూ సిబ్బంది, విద్యుత్ అధికారులతో మాట్లాడి ఇళ్ల మీద పడిన వైర్లను తొలగించారు. విరిగిన స్తంభం సరి చేయించారు. చెట్లు పడటంతో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అధికారులు వారిని ఆదుకోవాలని కోరారు. సహాయక చర్యల్లో మందా రవితేజ, మంచాల మరియ దాసు, మంచాల సుధాకర్, కన్నె కంటి సుధాకర్ పాల్గొన్నారు.

హై లెవెల్ వంతెన నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే వసంత



కల్వర్టు వద్ద మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వసంత కృష్ణ

మైలవరం : బుడమేరుపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని స్థానిక ఎంఎల్‌ఎ వసంత కష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు మండలంలోని హవేలి ముత్యాలంపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన వంతెనకు ప్రత్యామ్నాయంగా నిర్మించిన తాత్కాలిక లో లెవెల్ కల్వర్టు వరద ఉధతికి దెబ్బతింది. బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హై లెవెల్ వంతెన నిర్మాణానికి రూ.8.50 అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామన్నారు.

రైతు కంట కన్నీరు



గుడివాడలో పంటలు పరిశీలిస్తున్న ఆర్‌సిపి రెడ్డి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలే కనిపిస్తున్నాయి. వాటిని చూసిన రైతులు కన్నీరు కారుస్తున్నారు. నోటి దాకా వచ్చిన పంట దక్కకుండా పోయిందని కుమిలిపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. నిన్నటిదాకా నీటి ఎద్దడితో ఎండిన పైర్లను ఎలాగోలా బతికించుకుని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న రైతాంగానికి తుఫాను శరాఘాతంలా తగలడంతో ధాన్యం కొనండి మహాప్రభో అని రైతులు ఆర్బీకెల చుట్టూ తిరుగుతుంటే సంచులు లేవు, లారీలు ఖాళీ లేవు, అన్న సమాధానంతో రోడ్ల పక్కన ధాన్యం గుట్టలు వేసుకుని దయనీయంగా పడిగాపులు పడుతున్న రైతాంగాన్ని పట్టించుకునే నాథుడు లేక దిక్కులు చూస్తున్న పరిస్థితి అన్నదాతది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో రైతు గోల ఎవరికి పట్టడం లేదు. రైతు కష్టంపై జాలి లేదు. 15వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. కోట్లలో పంట నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి క్షేత్రస్థాయిలో పంట నష్టాలను నమోదు చేసుకుని రైతులకు తగిన రీతిలో పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** మిచౌంగ్ తుఫాన్ రైతులను నిండా ముంచింది. పంట చేతికొస్తున్న తరుణంలో తుఫా న్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులు కోలుకో లేనంతగా నష్టపోయారు. మండలం లో పలు గ్రామాల్లో కోతకోసిన వరిపనలు నీటిలో తేలియాడుతుండగా, మరికొంత మే ర కోతకోయని వరి నేలవాలి నీటిలో నానుతుండగా పొలాలు చెరువుల్లా కన్పిస్తున్నాయి. కుప్పలు వేసిన పొలాల్లో నీరు నిలిచి కుప్పల్లోకి నీరువెళ్ళి తడిసిపోగా, యంత్రాలతో కోతకోసి రోడ్లపక్క ఎండబెట్టిన ధాన్యం పోగుచేసి పట్టాలు కప్పి రైతులు తంటాలు పడి నప్పటికి వర్షపునీరు నిలబడి మొలకలు వస్తున్నాయి. కాటూరు, కడవకొల్లు గండిగుం ట, వీరవల్లి, ఉయ్యూరు తదితర గ్రామాల్లో పొలాల్లో నీరు నిలిచి చెరువుల్లా మారాయి. బుధవారం వర్షం ఆగి ఎండకాయడంతో పొలాల్లో నీరు బయటకు పోయేందుకు, ధాన్యం రాసుల వద్ద నీటిని తొలగించే ప్రయత్నంలో రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఇదిలా ఉండగా పొలాల్లో వేసిన మినుము విత్తనాలు నీటిలో కుళ్లిపోగా మరలా విత్తనాలకోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. మండల పరిధిలో 12,861 ఎకరాల్లో వరిసాగు చేయగా అందులో 4,006 ఎకరాల్లో కోతకోయకుండా నేలవాలి నీటిలో మునిగి పోగా, 3,340 ఎకరాల్లో పంట కోతకోసి పనలపై ఉండగా, 2,771 ఎకరాల్లో కుప్పలు వేసినట్టు మండల వ్యవసాయ అధికారి నిస్సీ గ్రేస్ తెలిపారు. **ప్రజాశక్తి -గుడివాడ(నందివాడ) :** మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో నందివాడ మండలంలోని తమిరిశ, జొన్నపాడు గ్రామాలలోని వరిపంట పూర్తిగా జలదిగ్బంధంలో ఉన్న పరిస్థితి నెలకొంది. తమిరిశ గ్రామంలో కోత కోసిన వరి పనలను కుప్ప వేసేలోపే తుఫాన్ ప్రభావంతో బారీ వర్షాలు కురిసి పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. అలాగే జొన్నపాడు గ్రామంలో వరి కోత మిషన్ ద్వారా కోత కోయించి ధాన్యాన్ని ఆరబెట్టడంతో వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయింది.

నీట మునిగిన పంటలు పరిశీలన

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తక్షణ నష్టపరిహారం సకాలంలో అందేలా సత్వర చర్యలు తీసుకోవాలని టీడీపీ గన్నవరం ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్ చేశారు. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, కానుమోలు గ్రామాల్లో తుఫాన్ ధాటికి దెబ్బతిన్న వరిచేలను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అరుగొలనులో నిల్వచేసిన ధాన్యం కూడా తడిసి మెలకులు వస్తున్నాయని వెంకటేశ్వరరావు అనే రైతు యార్లగడ్డకు చూపించారు. మోకాళ్లలోతు నీళ్లలో మునిగి కోయకుండా ఉన్న వరిపంటను పొలంలోదిగి ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతుకు ఎకరానికి 30వేల చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం సకాలంలో అందించాలని ఆయన డిమాండ్ చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు దయ్యాల నాగేశ్వరరావు,జనసేన మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, టిడిపి నాయకులు దొంతు చిన్నా, ఆళ్ల గోపాలకష్ణ, చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయికళ్యాణి పాల్గొన్నారు.**ప్రజాశక్తి,చల్లపల్లి :** స్థానిక మండలం కొత్తమాజేరులో గుండేరు డ్రెయినేజీని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ బుధవారం పరిశీలించారు. గుఱ్ఱపుడెక్క తొలగించి పొలాల ముంపు సమస్య పరిష్కారం చేయాలనీ... బాధిత రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలనివెంకట్రామ్ డిమాండ్ చేశారు.

తుపాను బాధితులను పరామర్శించిన ఎంఎల్ఎ

తుఫాన్ బాధితులను సకాలంలో పునరావాస కేంద్రాలను తరలించి ప్రాణ నష్టం జరగకుండా అధికార యంత్రాంగం చేసిన సమిష్టి కషి అభినందనీయమని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం, ఉల్లిపాయలు, బంగాళదుంపలను రమేష్ బాబు బుధవారం పంపిణీ చేశారు. అలాగే చల్లపల్లి మండలం మాజేరు, మంగళాపురం గ్రామాల్లో భారీ వర్షాలకు నీట మునిగిన వరి పంటలు, వరి పనలు వైఎస్ఆర్ సీపీ రైతు విభాగం ఉమ్మడి కష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు పరిశీలించారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండలంలో తుఫాను ప్రభావంతో నీట మునిగిన పొలాలను తెలుగు దేశంపార్టీ నియోజకవర్గ ఇంచార్జీ యార్లగడ్డ వెంకట్రావు తన బందంతో పరిశీలించారు. నీట మునిగిన పొలాలను అంచనా వేసి నష్ట పరిహారం అందించే విధంగా ఏ విధమైన నిబంధనలు లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసే విధంగా సహకరించాలని వెన్నూతల, నాగవర ప్పాడు, వెల్దిపాడు తదితర గ్రామాల రైతులు వెంకట్రావ్ కు విన్నవించారు. ఆళ్ళ గోపాలకష్ణ, దొంతు చిన్న, మండ వ లక్ష్మి, నెక్కలపూడి వెంకటరాజమన్నార్ పాల్గొన్నారు.

రైతును ఆదుకోని పక్షంలో పోరాటం చేస్తాం : వెనిగండ్ల

ప్రజాశక్తి, గుడివాడరూరల్: తుఫాను దాటికి నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని లేని పక్షంలో రైతుల తరపున పోరాటం చేస్తామని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం ఆయన రామనపూడి, తట్టివర్రు, మల్లాయపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** నష్టపోయిన వరిపంటకు రూ.30,000 నష్ట పరిహారం చెల్లించాలని టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గన్నవరం మండలం దావాజీ గూడెంలో వర్షాల కు దెబ్బతిన్న వరి పొలాలను ఆయన సందర్శించారు. రాష్ట్ర టీడీపీ నాయకులు దొంతు చిన్న, ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు, చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయి కళ్యాణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి :** మండలంలో శివరాంపురం, వెంకటాపురం, పెదప్రోలు, గ్రామాల్లో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) స్థానిక నాయకులతో కలిసి తడిసిన వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అలాగే రైతులకు మినుము మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నడకుదిటి జనార్ధన్ రావు, రాష్ట్ర తెలుగు యువత నాయకుడు రావి రత్నగిరి, కడవకొల్లు సీతారామాంజనేయులు, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల రాంబాబు, రైతు నాయకులు గవిని శివరామకష్ణ పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** తుఫాను వచ్చి వేలాది ఎకరాలలో పంట మునిగిపోతే ప్రభుత్వం పంటల పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని అశ్వారావు పాలెం గ్రామంలో పర్యటించి పంటలు మునిగిపోయిన రైతులను పరామర్శించారు. అశ్వారావుపాలెం మైనర్ డ్రైన్ మరమ్మతులు చేపట్టకపోవడం వలన తమ పొలాలు ముంపుకు గురయ్యాయని ప్రభుత్వం ముందుగానే పట్టించుకోని డ్రై న్ తవ్విస్తే ఏడు తమ పొలాలు మునిగేవి కాదని రైతులు బుద్ధ ప్రసాద్ వద్ద వాపోయారు. గ్రామ సర్పంచ్ పి లంకమ్మ ప్రసాద్, గ్రామ పార్టీ కన్వీనర్ దాసినేని శ్రీనివాసరావు రేపల్లె శివ నాగరాజు రైతులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** మీచాంగ్ తుఫాన్ ప్రభావంతో మచిలీపట్నం మండలంలోని తీవ్రంగా నష్టపోయారని కొల్లు రవీంద్ర తెలిపారు.బుదవారం కరగ్రహారం, క్యాంబిల్ పేట, చిన్నకరగ్రహారం, పల్లిపాలెం, నవీన్ మిట్టల్ కాలనీ, మేకవాని పాలెం,తాళ్లపాలెం, మంగినపూడి, తుమ్మల చెరువు, పెదయాదర, చినయాదర, భోగిరెడ్డిపల్లి, నెలకుర్రు చిన్నాపురం, గ్రామాలలో నీట మునిగి దెబ్బతిన్న వరి, వేరుశనగ, మినువు పంటలు పంటలను పరిశీలించారు. ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోవడంతో మొత్తం పొలాలు నీళ్లతో నిండిపోయి, అమ్ముకోవడానికి వీలు కాకుండా కుళ్లిపోయాయన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ రూరల్ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కాగిత వెంకటేశ్వరరావు,అనిశెట్టి రాము,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే మచిలీపట్నం నియోజకవర్గంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను యువ నాయకులు పేర్ని కష్ణమూర్తి (కిట్టు) బుదవారం పరిశీలించారు. పేర్ని కిట్టుతో పాటు జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, మాజీ జెడ్పిటిసి లంకే వెంకటేశ్వరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గాడేల్లి డేవిడ్ పొలాలను పరిశీలించారు. **ప్రజాశక్తి కోడూరు :** కోడూరు మండల పరిధిలోని దెబ్బతిన్న పంట పొలాలకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని కోడూరు మండల జనసేన పార్టీ నేతలు తెలిపారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య మాట్లాడుతూ ఎకరానికి 30 వేల రూపాయలు నష్టపరిహారాన్ని అందజేయాలని, కోరారు. ఉమ్మడి కష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత, జనసేన నాయకులు యర్రంశెట్టి దామోదర్ రావు, కోట రాంబాబు పాల్గొన్నారు.



బాపులపాడు మండలంలో పంటలు పరిశీలిస్తున్న యార్లగడ్డ

వర్షానికి కూలిన పూరిల్లు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం లింగారెడ్డి పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని జరుగువానిపాలెం గ్రామంలో అప్పికట్ల లంకేశ్వరరావు, వెంకటేశ్వరమ్మలకు చెందిన పూరిల్లు తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా పడుతున్న వర్షానికి గోడలు చెమ్మగిల్లి ఒకసారిగా ఇల్లు నేలకొరిగింది. సంబంధిత శాఖ అధికారులు పరిస్థితిని పరిశీలించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు. **ప్రజాశక్తి ఘంటసాల :** ఘంటసాల మండలం ఘంటసాల పాలెం దళితవాడలో నివాసముంటున్న కంచర్ల సముద్రాల ముసలవ్వ పూరిల్లు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక్కసారిగా కూలిపోయింది. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** మండలంలోని అంజనా పురం గ్రామా నికి చెందిన మాజీ ఎంపిటిసి పోరంకి శివ వరప్రసాద్‌కు చెందిన రెండెకరాల మునగ తోట వర్షానికి పూర్తిగా పాడైయింది. గాలులకు పంట మొత్తం నేల వాలింది. అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని ఆయన కోరారు.**ప్రజాశక్తి గుడ్లవల్లేరు :** మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో తుఫాన్ కారణంగా ముంపునకు గురైన వరి పొలాలను అధికారులు, ప్రజాప్రతి నిధులు బుధవారం పరిశీలించారు. వై.యస్.ఆర్. పార్టీ నాయకులు పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్ , వైస్ ఎంపీపీ శాయన రవి కుమార్ , పిఎసిఎస్ అధ్యక్షులు శేషం గోపి పాల్గొన్నారు.

చేనేతలను ఆదుకోవాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డ, యార్లగడ్డ చేనేత కార్మికులు బుధవారం స్థానిక తాసిల్దార్ కు వినతిపత్రం అందించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా మగ్గాలపై ఉన్న నూలు తడిసి మగ్గాల గుంటలోకి నీరు వచ్చి పనిచేసుకోవడానికి తీవ్రమైన ఆటంకం ఏర్పడిందని, ఉపాధి కోల్పోయామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మగ్గం పని చేయటం కుదరదని వివరించారు తమ సమస్యలను అర్థం చేసుకొని ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులు ఉచితంగా నూలు సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యద్దనపూడి మధు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా చేనేత కార్మికులు అందే వెంకట శ్రీనివాసరావు, కాగితపు బసవరాజు, మునగాల శేతుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస ఏర్పాట్లు పరిశీలన



ప్రజాశక్తి కోడూరు : కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని స్వతంత్ర పురం జిల్లా పరిషత్ హైస్కూల్ అధికారులు ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంలో ఏర్పాట్ల గురించి, భోజనం వసతి గురించి పలు ప్రాంతాల నుంచి వచ్చిన తుఫాను బాధితులను రైతు సంఘం నాయకులు అడిగి తెలుసుకున్నారు. వారు తిరుగు ప్రయాణం చేసేటప్పుడు ప్రభుత్వం వారికి ప్రకటించిన వస్తువులు ధన సహాయము 2500 రూపాయలు తప్పక వారి చేతికి ఇచ్చి పంపించాలని రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, పొలవత్తిన మోహన్ రావు, రేపల్లె యోగప్రకాష్, చెక్క వెంకటేశ్వరావు కొప్పనాతి తాతయ్య, బత్తిన రాజగోపాల్ పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో అనమనపూడి కాలనీ



ప్రజాశక్తి - గుడివాడ (నందివాడ) : నందివాడ మండలంలోని అనమనపూడి కాలనీ మి చౌంగ్ తుఫాన్ ప్రభా వంతో జలదిగ్బంధంలో మునిగిపోయింది. సోమ వారం, మంగళవారం కురి సిన వర్షాలకు కాలనీలోని రహ దారులు చెరువులను తలపిస్తున్నాయి. చేపల చెరువు లోని నీరు, వర్షపునీరు కలిసి కాలనీ మునిగిపోయింది. చెరువులు పూర్తిగా మునిగిపోయి గ్రామంలోకి నీరు వచ్చి కాలనీ మునిగిపోతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇప్పటి వరకు ఏ అధికారి తమను పట్టించుకోలేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. రహదారులు పూర్తిగా మునిగిపోయాయని దారిలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని చెప్తున్నారు.

మెళకువలు పాటించండి

ప్రజాశక్తి-మోపిదేవి : దెబ్బతిన్నటువంటి పంటలు అరటి కూరగాయలు ఇతర పళ్ళ తోటల మొక్కలను రైతులు ఇప్పుడు రక్షించుకోవాల్సిన పరిస్థితుల్లో కొన్ని పనులు చేసుకున్నట్లయితే త్వరగా కోలుకోవడానికి అవకాశం ఉందని అవనిగడ్డ నియోజకవర్గ ఉద్యానవన శాఖ అధికారి రమేష్ పేర్కొన్నారు. మొట్టమొదటిగా ఇప్పుడు అరటి తోటలో ఏవైతే వాలిపోయినయో వాటికి కర్రల ద్వారా రైతులు ఊత ఇచ్చినట్లయితే కొంత వరకు అరటి గెలలు భూమి మీద పడకుండా ఉండే అవకాశం ఉంటుం దన్నారు. అదేవిధంగా టమాటాల్లో కూడా భూమి మీద వాలి నటువంటి మొక్కలు ఏవైతే ఉన్నాయో పళ్ళతో సహా ఉన్నటువంటి మొక్కలు కూస్టేకింగ్ ఆపరేషన్ ద్వారా అంటే చిన్న చిన్న కర్రల ద్వారా వాటిని ఊతమిచ్చి రైతులు కట్టుకోవాలని ఆయన సూచించారు.

పంట నష్టం అంచనాకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాల వల్ల జరిగిన పంట నష్టాలను అంచనా వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. బుధవారం విజయవాడ రూరల్ మండలం రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల వరి పొలాలను ఆయన సందర్శించారు. పంట నష్టం జరగకుండా పొలాల నుంచి నీటిని బయటకు పంపించేందుకు అధికారులు చేసిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్‌లో 41,163 హెక్టార్లలో వరి సాగు చేయగా.. ఇప్పటికే 10 వేలకు పైగా హెక్టార్లలో కోతలు జరిగాయని తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 11,859 హెక్టార్లలో వరి, 169 హెక్టార్లలో శనగ, 26 హెక్టార్లలో పెసర, 46 హెక్టార్లలో కంది, 270 హెక్టార్లలో మొక్కజొన్న, 68 హెక్టార్లలో జొన్న, 28 హెక్టార్లలో మినప తదితర పంటలు నష్టపోయినట్లు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పంట పొలాల్లో నీరు బయటకు పోయే విధంగా ఎక్కడైతే డ్రెయిన్లలో తూటికాడ, గుర్రపుడెక్క వంటివి అడ్డు ఉన్నాయో ఆయా ప్రాంతాల్లో తక్షణమే జేసీబీల ద్వారా వాటిని తొలగించి నీరు పొలాల్లోంచి బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించామన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ డేటాలో నమోదైన సర్వే నంబర్ల ఆధారంగా పంట నష్టం వివరాలను సేకరించి.. తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, ఏడీ బి.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి బి.రంగనాథబాబు, తహసీల్దార్ కె.లక్ష్మి, రైతులు కె.నాగేశ్వరావు, జీఎస్ రాంప్రసాదరావు, బోయనపల్లి రంగారావు, బోయనపల్లి రమేష్, కె.శివాజీ, బి.రాంబాబు, డి.రాకేష్, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ డిల్లీరావు ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి తుపాను ప్రభావంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం కలెక్టర్ డిల్లీరావు, నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు జిల్లా అధికారులతో మాట్లాడుతూ వరి పనలు నీటిలో మునిగితే గింజలు తడిసి మొలకెత్తి, రంగు మారే అవకాశముందని.. అందువల్ల రైతులకు తగిన సూచనలివ్వాలన్నారు. రంగుమారిన ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులతో జిల్లాస్థాయి అధికారులకు సమన్వయం చేసుకొని రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

కట్టలేరుపై స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక కట్టలేరు వంతెనపై రాకపోకలు స్తంభిస్తే విద్యార్థులకు ఇబ్బందులు వస్తాయని తహశీల్దార్ జి.బాలకష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం తిరువూరు ఆర్‌డిఒ కె.మాధవి వంతెన ప్రాంతాన్ని, వరద ఉధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ ఉధతి, దీనితో వచ్చే ఇబ్బందులను ఆర్‌డిఒ తెలుసుకున్నారు.


కట్టలేరును పరిశీలిస్తున్న దృశ్యం

ప్రధానంగా విజయవాడకు రాకపోకలు స్తంభిస్తా యని, దీనివల్ల మరో 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. డైవర్షన్ రోడ్డులో గ్రావెల్‌తో సరిచేయాల్సి ఉందని లేకుంటే ప్రయాణానికి వీలుపడదని తెలిపారు. దీంతో పూర్తి భద్రతా చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ మాధవి సిబ్బందిని ఆదేశించారు. ఆర్‌డిఒ వెంట ఎస్‌ఐ పి.రాంబాబు, విఆర్‌ఒలు ఉన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - విస్సన్నపేట : పశ్చిమగోదావరి జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన దళితుల ముద్దుబిడ్డ పంతంగి వెరకోటిని బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం విస్సన్నపేటలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ రాజకుమార్, పిల్లి. రాజేష్, తదితరులు సన్మానించారు.


కోటిని సన్మానిస్తున్న దృశ్యం

పలుచోట్ల అంబేద్కర్ వర్ధంతి


అణగారిన వర్గాల హక్కుల కోసం, వారికి సామాజిక న్యాయం కల్పించేందుకు రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ నిరంతరం కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో పలుచోట్ల అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. పలు కార్యాలయాల్లో అధికారులు, నాయకులు బుధవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. పలుచోట్ల అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు. 8న రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి - తిరువూరు : జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ నివాళులర్పించారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్.వి.కె ఆధ్వర్యంలో జరిగిన అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. జెవివి మండల గౌరవాధ్యక్షుడు పి.శీనయ్య నివాళులర్పించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక భవానీపురంలో గల ఎన్టీఆర్ జిల్లా వైసిపి కార్యాలయంలో, పశ్చిమ ఎంఎల్‌ఎ వెలంపల్లి శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి చైర్మెన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు ఇర్ఫాన్, అంజనేయ రెడ్డి, కోటి రెడ్డి, చైతన్య రెడ్డి, పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ పోతిన వెంకట మహేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దనున్న నివాళులు అర్పించారు. **రెడ్డిగూడెం :** అంబేద్కర్ వర్ధంతి నాగులూరులో నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు విజయ్ కుమార్ చాట్ల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి అర్పించారు. **మైలవరం :** అంబేద్కర్ వర్ధంతిని మైలవరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడారు. **నందిగామ :** డా'బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి వేడుకలు బుధవారం నందిగామలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు, మాజీ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య, జనసేన పార్టీ నందిగామ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తంబళ్లపల్లి రమాదేవి ఆయా పార్టీల కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **పెనుగంచిప్రోలు :** డౌన్ సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి జనసేన, వైసిపి నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **వత్సవాయి :** కన్నెవేడులో నివాళులర్పించారు. **కంచికచర్ల :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు బుధవారం కంచికచర్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో, గామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది, చెవిటికల్లు రోడ్డు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి, అన్ని గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. **జగ్గయ్యపేట:** బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కొదముల ప్రభుదాస్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో లోని జగ్గయ్యపేట పట్టణంలోని స్థానిక సాయిబాబా టెంపుల్ వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి వేడుకల్లో బిఎస్‌పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నివాళులర్పించారు. పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రిస్టియన్ పేట, ఇందిరాకాలనీ, సత్యనారాయణపురంల్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 67వ వర్ధంతి సందర్భంగా వైఎస్‌ఆర్సిపి శ్రేణులు ఆయన విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. **విజయవాడ :** కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ పత్రిక అధ్యాయన కేంద్రం, దళిత అభ్యుదయ సంక్షేమ సంఘాల పెద్దలు, విద్యార్థుల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు, గుడిసె వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారను. 31వ డివిజన్ ముత్యాలంపాడులో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు శ్రీధర్ల రాజేష్, ఆటో వర్కర్స్ యూనియన్ టి సుబ్బారావు, తదితరుల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. **విస్సన్నపేట :** విస్సన్నపేట బహుజన దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి కొండా రాజకుమార్ తదితరులున్నారు. **ఇబ్రహీంపట్నం :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొండపల్లి లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొర్రా కిరణ్ డా బి ఆర్ అంబేద్కర్ 67 వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు నివాళి అర్పించారు. జాకీర్ హుస్సేన్ కళాశాల, భీమరాజు గుట్టలో నివాళులు అర్పించారు. శక్తి నగర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద నివాళులర్పించారు. ఎస్సీ ఎస్టీ ఎంప్లాయ్ అసోసియేషన్ నివాళులర్పించింది. ఎన్టీటీపీఎస్ మెయిన్ గేట్ దగ్గర నివాళులర్పించారు. జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గం ఇంచార్జ్ అక్కల గాంధీ నివాళులర్పించారు. **విజయవాడ అర్బన్ :** నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ఇండియన్ అంబేద్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ వద్ద గల యలమంచిలి కాంప్లెక్స్‌లో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు.


వన్‌టౌన్‌లో


ఇబ్రహీంపట్నంలో


కంచికచర్లలో


నందిగామలో


తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద


విజయవాడలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో


విజయవాడలో సిఐటియు ఆధ్వర్యంలో

అంగన్‌వాడీల వినతులు

నందిగామ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పిలుపులో భాగంగా నందిగామ గాంధీ సెంటర్లు అంబేద్కర్ విగ్రహం వద్ద సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కె.గోపాల్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ సీనియర్ నందిగామ ప్రాజెక్టు కార్యదర్శి కోలి సరళ, యామిని, ప్రమీల, దుర్గ, విజయ, ఫాతిమా, సుజాత తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** అంబేద్కర్ విగ్రహానికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఆర్‌వి పుష్ప కుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు కె.ఝాన్సీ, పి.రమాదేవి, ఎస్.అపర్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి :** గాంధీ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.రాము అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ ప్రాజెక్టు కార్యదర్శి టి.మదుకుమారి ఆదిలక్ష్మి పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** ఐసిడిఎస్ అధికారులకు అంగన్వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందించారు. అంబేద్కర్ సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి, అనిగండ్లపాడులోని అంబేద్కర్ విగ్రహానికి నిరవధిక సమ్మెకు అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్స్ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి దారా నాగేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ సమాన పనికి ఇవ్వాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సెక్టార్ లీడర్ కె బుల్లిమ్మ , వర్కర్స్ యూనియన్ నాయకులు సిఐటియు నాయకులు పాల్గొన్నారు. **తిరువూరు :** అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించమని సిఐటియు అధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు తిరు వూరు బోసుబొమ్మ సెంటర్ లోనీ బి.ఆర్.అంబేద్కర్ విగ్ర హానికి వినతిపత్రం అందజేశారు. ముందుగా అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తిరువూరు ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.నాగమణి, తిరువూరు సెక్టార్ కార్యదర్శి శ్రీలక్ష్మి, వెంకటేశ్వర మ్మ, నాగమణి, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, సిఐటియు నాయకులు ఆకుల రవి పాల్గొన్నారు.


పెనుగంచిప్రోలులో


మైలవరంలో



నందిగామలో


తిరువూరులో

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

• మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



వరి గింజలను పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి- మచిలీపట్నంరూరల్ : మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకుంటామని, అధైర్య పడవద్దని రాష్ట్ర పౌర సరఫరాల మరియు వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు రైతులకు భరోసా నిచ్చారు.బుధవారం మంత్రి పామర్రు, గుడూరు, బందరు, పెడన, బంటుమిల్లి మండలాల్లో పర్యటించి దెబ్బతిన్న వరి పొలాలు, ధాన్యం రాశులు పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి, రైతుల సమస్యల గురించి అడిగి తెలుసు కున్నారు. తొలిత మంత్రి పైడిముక్కల మండలం గోపవానిపాలెం, పామర్రు మండలం కొండిపర్రు రైతు లను, అనంతరం గూడూరు మండలం తరకటూరు రైతులను, బందరు మండలం సుల్తానగరం, అరిసెపల్లి రైతు లను బంటుమిల్లి మండలం ఆర్తమూరు, బాసిన పాడు రైతులను మంత్రి కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరబెట్టిన ధాన్యం రాశులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మిచోంగ్ తుఫాన్ అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతాంగానికి అండగా ఉంటామన్నారు. ఎన్యుమరేషన్ బందాలు ప్రతి గ్రామంలో పర్యటించి పంట నష్టం వివరాలు నమోదు చేసుకుని, అంచనాలు రూపొందించి, రైతులకు పంటల భీమా, ఇన్పుట్ సబ్సిడీ ప్రయోజనాలు కల్పించేందుకు కషి చేస్తామన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఆన్ లైన్లో 1.37 లక్షల మెట్రిక్ టన్నులు, ఆఫ్ లైన్ లో 1.10 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇప్పటివరకు రైతులకు రు.1070 కోట్ల రూపాయలు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు వేగంగా చెల్లింపులు చేస్తామని, రెండు, మూడు రోజులకోసారి రైతులకు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పర్యటనలో తరకటూరు వద్ద గూడూరు ఎంపీపీ సంఘ మధుసూదన్ రావు, జడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు మంత్రిని కలిసి రైతుల సమస్యలు వివరించారు.ఉయ్యూరు ఆర్డిఓ, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఇంచార్జ్ రాజు, డీఎస్ఓ పార్వతి, ఆయా మండలాల తాసిల్దార్లు రెవెన్యూ సిబ్బంది మంత్రి వెంట ఉన్నారు.

తుపాను బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-చల్లపల్లి. స్థానిక గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ఉన్నత అధికా రులు ఏర్పాటు చేసిన పున రావస శిబిరాన్ని బుధవారం సిపిఎం నాయకులు సందర్శించారు. శిబిరంలో ఏర్పాట్ల గురించి, భోజనం వసతి గురించి పలు తుఫాను బాధితులను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ బాధితులకు ప్రభుత్వం ప్రకటిం చిన 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారికి అందించాలని సిపిఎం మండల కార్యదర్శి యాద్దనపూడి మధు అధికారులకు సూచించారు. సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా పాల్గొన్నారు

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో తుపాను కారణంగా సుమారుగా 10 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయని ఎ.ఇ రవి కుమార్ తెలిపారు. మల్లేశ్వరం కాలువ గట్టుమీద ఏడు స్తంభాలు, పెద్దతుమ్మిడికాలనీలో రెండు స్తంభాలు నెలకొరగా వీటిని యుద్ధప్రాతిపదికన నిలబెట్టామన్నారు.

ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

• పంట నష్టాలను పరిశీలించిన సిపిఎం, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి..గన్నవరం : తుఫాను కారణంగా గన్నవరం మండలంలో దెబ్బతిన్న వివిధ పంటలను నమోదు చేసే కార్యక్రమాన్ని అధికారులు వెంటనే చేపట్టాలని సిపిఎం, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గన్నవరం మండలంలో ఆయా సంఘాల నాయకులు పర్యటించారు. నీట మునిగిన పంటలను చూసి రైతులను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కైలే ఏసుదాసు తదితరులు పర్యటనలో ఉన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వారు గన్నవరం మండలంలో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మిర్చి, కూరగాయ తోటలు దెబ్బతిని రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని చెప్పారు. ఎవరికి ఎకరానికి 20,000, మొక్కజొన్నకు 15000, మిర్చికి 30,000, కూరగాయ తోటలకు ఎకరానికి 20,000 ఇవ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలను సిపిఎం పార్టీ బందం మరియు కౌలు రైతు సంఘం సమన్వయంతో పర్యటించి వరి పైరును పరిశీలించారు. అనంతరం నీటిపారుదల లేక మునిగిపోతున్న పంటను కాపాడేందుకు పిల్లుకోడు లో పూడుకు పోయిన గుర్రపు డెక్కెను తొలగించారు. డ్రైనేజీ వ్యవస్థను ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో బాగు చేయించాలని నీట మునిగిన పంట నష్టాన్ని వివక్షత లేకుండా అంచనా వేసి నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరావు నాని భాస్కరరావు సాంబశివరావు రామారావు తదితరుల బందం పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** కత్తివెన్ను మండలం నీలిపూడి కొమాలపూడి ,కత్తివెన్ను, సీతనపల్లి తదితర గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన, దెబ్బతిన్న పొలాలను నాయకులు పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, నీలిపూడి గ్రామ సర్పంచ్ పాశం కష్ణ, ఎంపీటీసీ సభ్యులు పాశం సుజాత, కత్తివెన్ను మండల రైతు సంఘం కార్యదర్శి బుద్దన బాబి , రైతుసంఘం సీనియర్ నాయకులు పుప్పాల నరసింహారావు, పుప్పాల ఆదినారాయణ, పాశం రామ్మోహన్ రావు తదితరులు పంటను పరిశీలించిన వారిలో ఉన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** రైతులని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకులు అన్నే సుబ్బారావు అన్నారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంగా నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. బుధవారం ఉయ్యూరు మండలం కాటూరు జాబర్ల పూడి బోళ్లపాడు ముదునూరు, పెదపారుపూడి మండలం చిన్నపార్పూడి అప్పికట్ల గ్రామాల్లో పర్యటన చేసి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనురైతు సంఘం నాయకులకు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం రైతు సంఘం నాయకులు సుబ్బారావు మాట్లాడుతూ రైతులకు న్యాయం చేసి ఎకరానికి పంట అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్, కౌలు రైతులు మట్టా డేవిడ్ రంగారావు కోటేశ్వరరావు రామచంద్రరావు సంజీవరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** రైతు కౌలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం తోట్లవల్లూరు మండలంలో పర్యటించి మిచంగ్ తుఫాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కౌల్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సేలం ప్రకాష్ రావు, రైతు సంఘం నాయకులు చిక్కవరపు శ్రీహరి, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు చాగంటి వెంకట సుబ్బారావు మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి తుఫాను వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతు పరిస్థితి మోల్గే నక్క మీద తాటికాయ పడ్డ రీతిలో ఉందని, తుఫాను రైతులను నట్టేట ముంచిందని,రైతును ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే ఎన్నిమరేషన్ మొదలుపెట్టి ఆదుకోవాలని రంగారావు అన్నారు. ఎకరా పంటకు 50 వేల రూపాయలు పరిహారం అందించాలని, మిగులు ధాన్యం తేమ శాతంతో సంబంధం లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. **ప్రజాశక్తి ఘంటసాల :** ఘంటసాల మండలం లో మిచౌంగ్ తుపాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలను కౌలు రైతు సంఘం మండలం కార్యదర్శి వాకా రామచంద్ర రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న, రంగుమారిన, మొలకలోచ్చిన దాన్యాన్ని యుద్ధప్రతిపదికన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, 90శాతం సబ్సిడీ తో మినుము, పెసర విత్తనాలు సప్లై చేసి



బంటుమిల్లి, ఘంటసాలలో నీటిలో నానుతున్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

రైతుల్ని, కౌలు రైతుల్ని ఆదుకోవాలని అన్నారు. రైతులు ఒక ఎకరానికి 40 వేల వరకు పెట్టుబడి పెట్టారని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.కనుమూరి శ్యామసుందర్, రవి, కాజ శ్రీనివాసరావు, సోమన వెంకట పూర్ణ చంద్రరావు, మోటుపల్లి గోపి, పెంజర్తి వెంకటమురళి, చాట్రగడ్డ స్టాలిన్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** మండలంలోని గొడవర్రు గ్రామంలో సిపిఎం కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్, మండల కమిటీ సభ్యులు వి మరియదాసు, శాఖ కార్యదర్శి జోజి నీట మునిగిన వరి పైరులను సందర్శించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షా వర్షాలు తుఫాను తడిసిపోయినా మొలక వచ్చిన తేమగా ఉన్నా రైతులధాన్యాన్ని షరతులు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తాడంకి నరేష్ చేశారు.**ప్రజాశక్తి-కోడూరు :** ఆరుగాలం శ్రమించి పండించిన పంట నష్టపోయిన అన్నదాతను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, నాయకులు డిమాండ్ చేశారు. తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా దివి సీమ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు సంఘం నాయకుడు ఆవుల బసవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలు సడలించి చివరి ధాన్యం గింజ వరకు మద్దత్తు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల పార్టీ కార్యదర్శి పాలాబత్తిన మోహన్ రావు రేపల్లె యోగ ప్రకాష్ చెక్క వెంకటేశ్వరా లు బత్తిన రాజగోపాల్ కుప్పనాతి తాతయ్య పాలాబత్తిన రాంబాబు నాయకులుతదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించి పూర్తి మద్ధతు ధరకు ధాన్యం కోనుగోలు చేయాలి : సిపిఎం నేతల వినతి



గన్నవరంలో...



కంకిపాడులో..

ప్రజాశక్తి-మొవ్వ : నిబంధలు సడలించి చివరి ధాన్యంగింజ వరకు మద్ధతు ధరకు కొనుగోలు చేసి తుఫాను బాధిత రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు వినతి పత్రం అందించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి కారుమూరిని సిపిఎం నేతలు మొవ్వ మండలం వీరాయిలంక రోడ్డు వద్ద కలిసి రైతుల కష్టాలను వివరించి ఆదుకోవాలని కోరారు. సిపిఎం నేతల అభ్యర్ధన మేరకు సమీపంలో ఉన్న నీట మునిగిన వరి పొలాన్ని మంత్రి కారుమూరి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మద్దుల బసవయ్య, కొనకళ్ళ రాంబాబు, శ్రీను తదితరులుపాల్గొన్నారు.



కోడూరులో...



తోట్లవల్లూరులో..



మొవ్వలో మంత్రి కారుమూరికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు



ఉంగుటూరులో గుర్రపుడెక్క తొలగిస్తున్న నాయకులు

నష్టపోయిన రైతు, కౌలు రైతులను ఆదుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు
- కృష్ణాజిల్లాలో పలు మండలాల్లో బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, మోపిదేవి, మొవ్వ, పమిడిముక్కల

తుపానుకు తీవ్రంగా నష్టపోయిన రైతులు, కౌలు రైతులను, ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, వెంటనే ఎన్యుమరేషన్ ప్రక్రియను ప్రారంభించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లాలోని మొవ్వ మండలం నిడుమోలు శివారు వీరాయలంక, గూడూరు మండలం తరకటూరు, మోపిదేవి మండలం మోపిదేవి, మోపిదేవిలంక, పమిడిముక్కల తదితర ప్రాంతాల్లో తుపానుకు దెబ్బతిన్న పంటలను, మచిలీపట్నంలోని ఇంజనీరింగ్ కాలేజీలో పునరావాస శిబిరంలో వలస కార్మికులకు అందుతున్న సౌకర్యాలను సిపిఎం బృందం బుధవారం పరిశీలించింది. తుపాను కారణంగా తమకు జరిగిన నష్టాన్ని ఆయా గ్రామాల్లోని కౌలు రైతులు, రైతులు సిపిఎం బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మచిలీపట్నంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కంకిపాడు నుంచి మచిలీపట్నం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా తుపానుకు వరి పంట ముంపుకు గురై ఉందని, కొన్ని ప్రాంతాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లాలో రైతులతోపాటు 80 శాతం భూములను సాగు చేస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కౌలు రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను ప్రత్యేక విపత్కర పరిస్థితిగా గుర్తించి నిబంధనలు సడలించి తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. మచిలీపట్నంతో పాటు తీర ప్రాంతం మండలాల్లో తుఫాను కారణంగా వేటకు వెళ్ళే అవకాశం లేక మత్స్యకారులు, వ్యవసాయంలో యంత్రాలు రావడం తుపాను కారణాలతో వ్యవసాయ పనులకు వెళ్లే అవకాశం లేక వ్యవసాయ కార్మికుల జీవనోపాధి దెబ్బతిందన్నారు. మత్స్యకారులు, వ్యవసాయ కార్మికులకు బియ్యం, నూనెలు, పప్పు దినుసులు తదితర నిత్యావసరాలతో పాటు కొంత నగదు ఇవ్వాలన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతోనే వారం రోజులైనా పొలాల్లో నీరు కదలక ఉండిపోయి నష్టం తీవ్రత పెరుగుతోందని రైతులు, కౌలు రైతులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. రైతులకు బ్యాంకు రుణాలను రెన్యూవల్ చేయాలన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి అవసరమైన నిధులు ఇచ్చి రైతాంగాన్ని, ఇతర ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కోత కోయకుండా ఉన్న వరి పంటకే పంటల బీమా వర్తిస్తుందని నిబంధనలు ఉన్నాయని, చాలా ప్రాంతాల్లో పనలపై ఉన్న పొలాలు నీటిలో నానుతున్నాయన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులకు మేలు చేయడానికి ఈ నిబంధనలు సడలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. భూ యజమాని సంతకంతోనే కౌలు కార్డులు ఇవ్వాలని నిబంధనతో చాలా మంది కౌలు రైతులకు కార్డులు రాలేదన్నారు. పరిహారం అందే అవకాశం లేదన్నారు. ఈ నిబంధనలను మార్చాలన్నారు. నూర్చిన ధాన్యం 10 రోజులు అయినా మిల్లులకు వెళ్లడం లేదని తమ పరిశీలనలో తేలిందన్నారు. ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణ, మోపిదేవి మండల కార్యదర్శి బండి ఆదిశేషు, నాయకులు మద్దుల బసవయ్య, జొన్నలగడ్డ వాసు, శ్రీను, శివరాం, సొంటి లక్ష్మణ్, సుబ్బారావు, బసవయ్య, కృష్ణాపురం మాజీ సర్పంచ్ మంటాడ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట గంగపాలు

పెద్దిబోయిన సోమేశ్వరరావు, మోపిదేవిలంక రైతు

నాకున్న 20 సెంట్లలో మిరప, నాలుగు ఎకరాల్లో మాగాణి తుపాను వల్ల పనికి రాకుండా పోయింది. ఎకరానికి 30 నుంచి 40 వేల దాకా ఖర్చు చేసినా పంట చేతికి వచ్చే సరికి మొత్తం గంగపాలైంది. ఈ ప్రభుత్వం ఎంత నష్టపరిహారం ఇచ్చినా మా నష్టం తీర్చలేనిది.

పంట పనికి రాకుండా పోయింది

కొండేటి గాంధీ, మోపిదేవిలంక రైతు

అరటి తోట ఈదురుగాలుల తాకిడికి ఎందుకు పనికిరాకుండా పోయింది. నేడు అరటి గెల రూ.30 అయినా కొనే దిక్కులేదు. నిన్నటి వరకు కళకళలాడిన తోట నేడు శ్మశానాన్ని తలిపిస్తోంది. ఏం చేయాలో పాలుపోవడంలేదు.



పునరావాస కేంద్రాల్లో వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

పునరావాస శిబిరాల పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: తూపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన సిపిఎం బృందం అనంతరం మచిలీపట్నం మండలంలోని మేకావానిపాలెం ఎస్‌విహెచ్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని పరిశీలించింది. ఈ శిబిరంలో మచిలీపట్నం పోర్ట్ పనులు చేయడానికి వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులను కలుసుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వసతులు, భోజన సదపాయాలు గురించి వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతో పాటు మాదాల వెంకటేశ్వరరావు, కొడాలి శర్మ, వడుగు గంగాధర్, మచిలీపట్నం నగర కార్యదర్శి బురా సుబ్రహ్మణ్యం, సీఐటీయూ రూరల్ కార్యదర్శి సిహెచ్ జయరావు, పట్టణ కమిటీ సభ్యులు ఎండి యూనస్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

కన్నీరే మిగిలింది !


చూసి కుమిలిపోతోంది. బందరు మండలం సుల్తానగర్‌కు చెందిన యార్లగడ్డ వీరప్రసాదరావు 10 ఎకరాల్లో వరి నూర్పిడి చేశారు. వాహనాలు అందుబాటులోకి రాక ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లలేదు. 40 కిలోల బస్తాలు 500 రోడ్డుపైన ఉంచి టార్బాలిన్‌లు కప్పారు. ఈదురుగాలులకు ధాన్యం సంచుల నెట్టుపై కప్పిన టార్బాలిన్‌లు ఎగిరిపోయాయి. 200 బస్తాల్లో ధాన్యం తడిచిపోయింది. వాహనాలు లేక కొకనారాయణపాలెంకు చెందిన కొల్లేటి శివయ్య రెండు ఎకరాల్లో ధాన్యం రాసి రోడ్డుపైనే ఉండిపోయింది. రాసి కిందకు నీళ్ళు చేరాయి. బస్తాల్లోని ధాన్యం, రోడ్డుమీద రాసుల్లోని ధాన్యం మొలకలు వచ్చింది. మొవ్వ మండలం నిడుమోలు శివారు వీరాయలంకకు చెందిన పామర్తి శ్రీనివాసరావు వరి మాగాణుల్లో రెండో పంటగా సాగు చేయడానికి రెండు క్వింటాళ్ళు మినుము జల్లారు. శ్రీనివాసరావు పొలంలోని నేలవాలిన వరి, మినుము నీటిలో మునిగిపోయాయి. వరి పంటతో పాటుగా క్వింటాకు రూ.12 వేలు చొప్పున రెండు క్వింటాళ్లకు రూ.24 వేలు నష్టపోయారు. ఇలా ఒకరు ఇద్దరు కాదు..జిల్లా అంతటా ఏ రైతు, కౌలు రైతును కదిపినా తమకు కలిగిన నష్టాన్ని తలుచుకుంటూ ఆందోళన చెందుతున్నారు. పంటల పెట్టుబడులకు లక్షల్లో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలవడం లేదని వాపోతున్నారు.



నీట మునిగిన వరిని చూసి కన్నీటి పర్యంతమవుతున్న వీరమ్మ

నిబంధనలు సడలిస్తేనే పరిహారం

కృష్ణాజిల్లాలో 81, 584 హెక్టార్లలో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా. ఈదురుగాలులకు 61 వేల హెక్టార్లు వరి పంట నేలకొరింది. 17,032 వేల హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. 2,275 హెక్టార్లలో మినుము, 182 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నేలవాలిన కోత కోసి పనలపై ఉన్న వరి కంకులపై నీరు చేరడంతో మొలకలొస్తున్నాయి. ఈ ధాన్యం కొంటారో కొనరో, కొన్నా ఎంతకు కొంటారో తెలవని పరిస్థితి. అంతులేని నష్టం జరిగినా ప్రభుత్వ పరిహారం అందుతుందో అందదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్ళుగా కోత కోసి పనలపై (పోస్టు హార్వెస్టింగ్) ఉన్న పొలాలకు జరిగిన నష్టానికి బీమా, పరిహారం చెల్లింపులకు పరిగణలోకి తీసుకోవడం లేదు. జిల్లాలో వేలాది ఎకరాలు వరి పంట కోత కోసి పనలపై ఉంది. నిబంధనలు సడలిస్తేనే తమకు సాయం అందుతుందని రైతులు చెబుతున్నారు.



ఉయ్యూరులో రైతు కష్టాలు

ఉద్యాన పంటలు అతలాకుతలం

పెట్టుబడి పెట్టి ఆరుగాలం శ్రమించిన కష్టమంతా నీటి పాలు కావడంతో రైతన్నలు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 42 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేపట్టారు. వీటిల్లో సుమారు 2,310 హెక్టార్లలో ఇప్పటి వరకు పంట బాగా నీట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. గుర్తించిన విస్తీర్ణంలో పంట పూర్తి స్థాయిలో నీట మునిగినట్లు నిర్ధారణకు వచ్చారు. దెబ్బతిన్న పంటల సాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి స్థాయిలో క్షేత్ర పర్యటన, పరిశీలన అనంతరం దీనిపైన స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. బుధవారం కాస్త తెరప ఇవ్వడం వల్ల క్షేత్ర స్థాయి పరిశీలన కావించారు. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పరిశీలన సాధ్యం కాలేదు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా 102 హెక్టార్లలో అరటి సాగు చేపట్టగా అందులో సగం తుపాను ప్రభావానికి గురైంది. దాదాపు 55 హెక్టార్ల అరటి పంట నేలకొరిగాయి. దాదాపు 67హెక్టార్లలో బొప్పాయి పంట సాగు చేపట్టగా అందులో 27 హెక్టార్లలో బొప్పాయి పంట చెట్లు పడిపోవడంతో నీట మునిగింది. పసుపు 155హెక్టార్లలో సాగు చేపట్టారు. దీనిలో 50 హెక్టార్ల పసుపు పంట మిచౌంగ్ తుపాను కారణంగా నీట మునిగింది. మిర్చి జిల్లాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉద్యాన పంట. ఈ దఫా దాదాపు 20వేల హెక్టార్లలో మిరపను సాగు చేపట్టారు. అయితే మిచౌంగ్ తుపాను దాటికి 80 శాతం పంట దెబ్బతినింది. దాదాపు 1870హెక్టార్లలోని పంట నీట మునిగి పోయింది. 1200హెక్టార్లలో వంగ, బెండ, దొండ, చిక్కుడు వంటి ఇతర కూరగాయలతో పాటు ఆకు కూరలు పంటలు సాగు చేపట్టగా 273హెక్టార్లలోని కూరగాయల పంటలను నీట మునిగాయి. మామిడి పంటకు ఇప్పుడు పూత మొదలయ్యే సీజన్. రెడ్డిగూడెం ప్రాంతంలో ఇప్పటికే పూత వచ్చింది. మరి కొన్ని ప్రాంతాల్లో పూత రావడం మొదలైంది. అయితే మిచౌంగ్ తుపాను మామిడి కూడా దాటికి దెబ్బతినింది. ఈ వర్షాలు, ఈదురు గాలుల ప్రభావానికి పూత రాలిపోయింది. పూత కంటే ముందు వచ్చే ఆకులు రాలిపోయాయి. జిల్లాలో 19వేల హెక్టార్లలో మామిడి సాగు ఉంది. అన్ని ప్రాంతాల్లో మామిడి ఎఫెక్ట్ అయింది. దీంతో పాటు పూల సాగు కూడా దెబ్బతిన్నాయి. జిల్లాలో 142 హెక్టార్లలో పూలు సాగు చేపట్టారు. వీటిల్లో 35 హెక్టార్ల సాగు నీటి మునిగింది.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం : కలెక్టర్

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : జిల్లాలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో వరి పొలాలు పడిపోయి మునకన పడిన రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాల వారికి అండగా ఉంటుందని జిల్లా ప్రత్యేక అధికారి లక్ష్మీ శా, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు రైతంగానికి భరోసా కల్పించారు. మిచౌంగ్ తుపాను నేపథ్యంలో ప్రభుత్వం కష్ణా జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించిన రాష్ట్ర గహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ లక్ష్మీ శా, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలసి మచిలీపట్నం మండలం లోని అరిసేపల్లి, గూడూరు మండలంలోని చిట్టి గూడూరు గ్రామాలలో పడిపోయిన వరి పంట పొలాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి లక్ష్మీ శా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మిచౌంగ్ తుపాను కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించేందుకు పర్యటిస్తున్నామని తెలుపుతూ ప్రస్తుతం జిల్లాలో 61 వేల హెక్టార్లలో వరి పొలాలు పడిపోయి నీట మునిగాయని తెలిపారు. పడిపోయిన పంట పొలాల్లో నీరు ఎక్కువగా నిలువ ఉండిపోయిందని, ఆ నీటిని బయటకు పంపేందుకు వీలుగా ప్రధాన మురుగు కాలువలతో పాటు చిన్న మురుగు కాలువలలోని గుర్రపుడెక్క, పూడికను తీయించే విధంగా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధైర్య పడద్దని అన్నారు. జిల్లాలో దెబ్బతిన్న పంటను రానున్న 48 గంటల్లో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పునరావాస బాధితులకు సాయం అందించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి : తుఫాను శిబిరాల్లో తలదాచుకున్న బాధితు లకు ముందుగా ప్రకటించిన విధంగా ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సహాయక శిబిరాల్లో తలదాచుకున్న ఒక్కో కుటుంబానికి రూ. 2,500 ఆర్థిక సాయం, బియ్యం నిత్యావసరాలు అందిస్తామని ప్రభు త్వం ప్రకటించిందని గుర్తు చేశారు. జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో పెట్టిన శిబిరాల్లో తలదాచుకున్న బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన సాయం అందించ కుండా పేర్లు నమోదు చేసుకుని ఒట్టి చేతులతో పంపుతు న్నారన్నారు. తుఫాను పరిస్థితుల్లో వారం రోజులుగా ఉపాధి కోల్పోయారని, మరో వారం రోజులు వారికి ఉపాధి దొరికే పరిస్థితి లేదన్నారు. ఈ పరిస్థితుల్లో బాధితులు ఇంటికి పంపే ముందే ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆర్థిక, నిత్యావసర సరుకులు అందించాలన్నారు. తుఫాను కారణంగా తీర ప్రాంత గ్రామాల్లోని మత్స్య కారులు 15 రోజులు ఉపాధికి దూరమవుతున్నారని, యంత్రాలు పెరగడంతో వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. మత్యకారులు, వ్యవసాయ కార్మికులకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. లక్షలాది ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి కష్టాలు పడుతున్నారని అన్నారు. సీజన్ మొదట్లోనే జులైలో కురిసిన వర్షాలకు లక్షలాది ఎకరాలు ముంపుకు గురయ్యాయన్నారు. ఇప్పుడు పంట చేతికి వస్తున్న తరుణంలో తుపాను విరుచుకుపడి తీవ్రంగా నష్టపోయా రన్నారు. రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా ఆచరణలో అమలవ్వడం లేదన్నారు. తేమ ఎక్కువ ఉం దని కొనుగోలుకు నిరాకరిస్తున్నారన్నారు. మిల్లులకు పం పిన ధాన్యం అన్‌లోడ్ అవ్వడం లేదని, ధాన్యం రవా ణాకు వాహనాలు అందుబాటులోకి రాక రైతులు ఇ బ్బం దులు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరిం చాలన్నారు.

పంటలు పరిశీలించిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్: తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వైసిపి నేతలు భరోసా రైతులకు ఇచ్చారు.గత రెండు రోజుల క్రితం ఎడ తెరిపి లేకుండా కురిసిన తుఫానుకు బాపులపాడు మండ లంలో లోతట్టు పాంతాలు జలమయమయ్యాయి. బాపులపాడు మండలంలోని కాకులపాడు, లక్ష్మీపురం రామన్నగూడెం గ్రామాల్లో బుధవారం వైసీపీ మండల అధ్యక్షుడు నక్క గాంధీ, కన్వీనర్ అవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యరగొర్ల నగేష్, గ్రామంలో పర్యటించి పంట పొలాలు లోతట్టు ప్రాంతాలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులను ఆదుకునే విధంగా ఎమ్మెల్యే వంశీ మోహన్ దష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుండి అన్నదాతలకూ నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కెసిపిలో క్రషింగ్ ప్రారంభం

ప్రజాశక్తి ఉయ్యూరు : కేసీపీ చక్కెర కర్మాగారంలో 2022-2023 సీజన్ కు చెరకు క్రషింగ్ కర్మాగార యూనిట్ హెడ్ వై సీతారామదాస్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో 4 లక్షల టన్నుల చెరకు గానుగాడ వలసి ఉందని, క్రషింగ్ లాం చనంగా ప్రారంభించినప్పటికి తుఫాన్ కారణంగా పొలాల్లో నీరునిలిచి ఉన్నదును వారంరోజుల తరువాత తిరిగి పూర్తిస్థాయిలో క్రషింగ్ పున: ప్రారంభిస్తామని భావిసు బిన్నామన్నారు. రానున్న సీజన్కు ఎక్కువ విస్తీర్ణంలో చెరకు సాగుచేయాలని రైతులకు విజ్ఞప్తిచేశారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, రైతు సంఘ నాయకులు ఎస్వీ కష్ణారావు, వి రత్నగిరిరావు, తిమ్మారెడ్డి, అంజిరెడ్డి, ధనకోటేశ్వరరావు, అసి స్టెం ట్ కేన్ కమిషనర్ ముత్యాలు, జీఎం కేన్ పున్నారావు, డీజీఎం సూర్యారావు, కర్మాగార ఉద్యోగులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

త్వరలో 'అంబేద్కర్ చైర్' ఏర్పాటు

- కెయు ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చైర్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి ప్రకటించారు.డా బి ఆర్ అంబేద్కర్ 67 మహాపరినిర్వాన్ దివస్ సందర్భముగా విశ్వవిద్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లలో డా అంబేద్కర్ చైర్ లు చాలా బాగా పనిచేస్తున్నాయని, అదే కోవలో కష్ణా విశ్వవిద్యాలయం లో డా అంబేద్కర్ చైర్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. డా బి ఆర్ అంబేద్కర్ స్పృశించని రంగం లేద న్నారు. 32 డిగ్రీలు, 4 పిహెచ్‌డిలు ఆయనకే సొంతమన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా వీర బ్రహ్మచారి, ఎస్సీ,ఎస్టీ సెల్ సమన్వయకర్త డా ఎం శ్రావణి, అర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుందర కష్ణా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, పెద్ద సంఖ్యలో ఆచార్యులు, సహాయ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన కుటుంబానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బండి రామకష్ణ 5 వేల నగదు నిత్యావసర సరుకులు బుదవారం అందించారు. వర్షాలకు మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధి లోని 31 వ డివిజన్ శారదానగర్ శివారు కల్యాణనగర్‌లో ఓ రేకుల షెడ్డు ఇల్లు నేల కూలిపోయింది. నిరాశ్రయులైన కొడాలి శ్రీధర్ రత్నకుమారి కుటుంబానికి దాతలు,ప్రభుత్వం ఆదుకోవాలని రామకష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో జనసెన పట్టణ అద్యక్షుడు గడ్డం రాజు, ఉడుముల బుజ్జి,కూనపరెడ్డి ప్రసాద్, హేమశ్రీ పాల్గొన్నారు.

వర్షం నీరు తొలగింపు

ప్రజాశక్తి-అవనిగడ్డ : తుఫాను వల్ల అవనిగడ్డ లో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమ యం అయ్యాయి. దీనితో పంచాయతీ సర్పంచ్ గో రుముచ్చు ఉమా ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శి తోట శ్రీనివాసరావు యుద్ధ ప్రాతిపదికన వర్షపునీరు తొలగించే చర్యలు చేపట్టారు. సర్పంచి కార్యదర్శి స్వయంగా గ్రామంలో సంచరిస్తూ జెసిబి ద్వారా ఏ ప్రాంతంలో అయితే వర్షపు నీరు నిలువ ఉందో అక్కడ డ్రైనేజీల పూడిక తీసి వర్షపు నీరు పోయే విధంగా చర్యలు చేపట్టారు.అనంతరం శానిటేషన్ సిబ్బంది తో బ్లీచింగ్ చల్లిస్తామని దోమల నిర్మూలన కూడా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఉమా తెలిపారు

బాధితులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : తుఫాను కారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించిన కుటుంబాల వారికి ఖర్చులకు గాను ప్రభుత్వం ప్రకటించిన నగదును ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. బుధవారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నటువంటి పునరావాస కేంద్రంలో 86 మంది కి రామచంద్రపురం లో ఉన్న పునరావాస కేంద్రంలోని 27 మందికి అదేవిధంగా గర్ల్స్ హైస్కూల్లో ఉన్న వారికి నగదు అందజేశారు. ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, తాసిల్దార్ ఎల్ వి ఎస్ రామకష్ణ, నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్, గ్రామ సర్పంచ్ గో రుముచ్చు ఉమా పాల్గొన్నారు

అంబేద్కర్ ఆశయాలను సాధించాలి

- పలుచోట్ల వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి-గన్నవరం : భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 67 వ వర్ధంతి కార్యక్రమాన్ని గన్నవరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో బుధ వారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. యం డి ఓ సత్య కుమార్, పంచాయతీ కార్యదర్శి సి హెచ్ అనిల్ కుమార్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ :** స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ భవనంలో ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషర్ వి మురళీకృష్ణ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అలాగే స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అలాగే స్థానిక శరత్ థియేటర్‌లో వైఎస్ఆర్‌సిపి ఎస్‌సి సెల్ జిల్లా కార్యదర్శి వెంపటి సైమన్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పిపిఎం పార్టీ గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అంబేద్కర్‌చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పివి రావు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పంతగాని సురేష్, సిఐటియు నాయకులు రేపాని కొండ, ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజని, ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, టిజి ప్రకాష్, కె సురేష్‌బాబు, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-చల్లపల్లి:** చల్లపల్లి మండలం,కొత్త మాజేరులో అంబేద్కర్ విగ్రహానికి గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్, గ్రామ పిఎసిఎస్ అధ్యక్షులు అర్జా శివశంకర్, ఉద్యోగ సంఘాల నేతలు చింతల శ్రీనివాసరావు,ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వమించిన కార్యక్రమంలో ఆ పార్టీ అధ్యక్షుడు అబ్బాస్ మీర్ రిజ్వాన్, బుద్దిస్ట్ వి. ఆదినారాయణరావు పాల్గొన్నారు **ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** దేశ అభివృద్ధికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే గొప్ప స్ఫూర్తి అని,నాటి సమాజం లోని అంటరానితనం, వివక్షతల పై అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్



అవనిగడ్డలో...

అని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు కొనియాడారు. కష్ణాజిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. బాబాసాహెబ్ అంబేద్కర్ 67 వ వర్ధంతిని పురస్కరిం చుకొని బుధవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు , రాష్ట్ర గహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వార్డు, గ్రామ సచివాలయ డైరెక్టర్, కష్ణాజిల్లా తుపాను ప్రత్యేక అధికారి లక్ష్మీశా, జిల్లా ఎస్పీ పి.జాషువా, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీడీవో దారపు శ్రీనివాస్, దళిత నాయకులు వారా పాపారావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి కోడూరు :** కోడూరు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య, ఉమ్మడి కష్ణా జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత, పార్టీ సీనియర్ నాయకులు యర్రం శెట్టి దామోదర్ రావు, కోట రాంబాబు, ఉపాధ్యక్షులు జరుగు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** మండల కేంద్రమైన పెదపారుపూడి చెరువుగట్టు సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి గోగం సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు గోళ్ళ సోమేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ జాజుల చిన్నారి, పిఎసిఎస్ అధ్యక్షుడు తుమ్మల కోటేశ్వరరావు, ఎంపీటీసీ వేమూరి మోహన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కంకిపాడు : జనసేన పార్టీ అధ్వర్యంలో కంకిపాడు మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి వీరస్వామి, చొక్కా రాజా గార్ల నేతత్వంలోఅంబేద్కర్‌కు నివాళి అర్పించారు. టిడిపి నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ, పులి శ్రీను, కొండా నాగేశ్వర రావు, జనసేన నాయకులు బోయిన నాగరాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** నాగాయలంక మండలం పెద్దపాలెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఉపసభాపతి మండలి వద్ద ప్రసాద్ పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జీవి మార్కెట్ కమిటీ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షులు మెండు చంటి, మండలి ఉదయభాస్కర్, మేడికొండ, విజయ్ గ్రామ సర్పంచ్ దున్న రాజేష్ పాల్గొన్నారు. అదేవిధంగా అవనిగడ్డ వైసిపి కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. పార్టీ నియోజక వర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ లు నలుకుర్తి పథ్వీ రాజు, సైకం బాబురావు పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గురువాక శేషుబాబు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్, పార్టీ ఉపాధ్యక్షులు నాదెళ్ల జేమ్స్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్:** ప్రపంచంలోనే అతి పెద్ద భారత రాజ్యాంగాన్ని లిఖించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని టీడీపీ గన్నవరం ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అంబేద్కర్ 67వవర్ధంతి సందర్భంగా బుధవారం బాపులపాడులోని సీఎస్ఐ చర్చి వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. వీరవల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి జిల్లా తెలుగుయువత కార్యదర్శి మండాది రవీంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు వడ్డీ శివనాగేశ్వరరావు, ఆళ్ల గోపాలకష్ణ పాల్గొన్నారు.**ప్రజాశక్తి ఉయ్యూరు :** వైసీపీ కార్యాల యంలో అంబేద్కర్ చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పి ంచారు. ఏజీఅండ్స్ ఎస్ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, అధ్యాపకులు అంబేద్కర్ చిత్రపటంవద్ద నివాళులర్పించారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సభ ఎంపీడీవో శేషగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఎంపీపీ సరోజిని, ఎంఈఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మరో మైలురాయిని అధిగమించిన ఎన్ఎస్ఇ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తమ ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫారమ్‌లో మొదటిసారిగా లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను సాధించినట్లు ఎన్ ఎస్ ఈ ప్రతినిది ఎం.రామ సుబ్బా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.. 2012లో ప్రారంభమైనప్పటి నుండి, ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫారమ్ అభివద్ధి చెందుతున్న చిన్న, మధ్యస్థ సంస్థలకు ఆచరణీయమైన, స్థిరమైన అవకాశాన్ని అందించడంలో ఉత్ప్రేరకంగా పనిచేసింది అన్నారు. ఇటీవల కాలంలో స్టాక్ ఎక్సేంజ్ పట్ల ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారని అన్నారు. రానున్న కాలంలో ఇంకా ఎక్కువ, ఆదరణతో పాటు కంపెనీలు కూడా పెరగనున్నాయని తెలిపారు .

కోటి దీపోత్సవానికి గయాజుద్దీన్ వితరణ



కోటి దీపోత్సవానికి సహాయం చేస్తున్న గాయజుద్దీన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక భవానీ పురంలోని శ్రీ దుర్గా భవానీ దేవస్థానం ఆధ్వర్యంలో జరగనున్న కోటి దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని జనసేన నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాజుద్దీన్ (ఐజా)కు దేవాలయ కమిటీ సభ్యులు బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కోటి దీపోత్సవ కార్యక్రమానికి భక్తితత్వంతో తనవంతుగా ఐజా రూ. 10 వేలు వితరణ చేశారు. స్థానిక 41వ డివిజన్‌కు చెందిన షేక్ సుల్తానా హుస్సేన్ దంపతుల కుమార్తె వివాహ నిమిత్తం వారికి ఐదు వేల రూపాయలు విరాళాన్ని కూడా ఐజా అందజేశారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని గయాజుద్దీన్ తన కార్యాలయంలో నిర్వహించి అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు నసీమా, జనసేన నాయకులు ఇస్మాయిల్ , సయ్యద్ అలీ, ముస్సు తదితరులు పాల్గొన్నారు.

పిపిఎస్ మోటార్స్‌తో భాగస్వామ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్కానియా కమర్షియల్ వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, పిపిఎస్ మోటర్స్‌తో తన ప్రత్యేక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు సంస్థ ఇంఛార్జి ఎం.సత్య నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా స్కానియా మైనింగ్ టిప్పర్‌లకు ఏకైక ప్రతినిధిగా వారిని నియమించింది. అని తెలిపారు ఈ భాగస్వామ్యం అమ్మకాలు, సేవా కార్యకలాపాలకు విస్తరించి నట్లు తెలిపారు. స్కానియా ఇండియా ఎల్లప్పుడూ సాంకేతికత శక్తితో కూడిన పరిష్కారాలు, ఆవిష్కరణల ద్వారా నడిపించబడే స్థిరమైన రవాణా పరిష్కా రాలను తీసుకురావటం పట్ల పూర్తి నమ్మకం కలిగి ఉంద న్నారు. అధిక లభ్యత, పెరిగిన ఉత్పాదకత, మెరుగైన కస్టమర్ లాభదాయకతను ఇస్తుందన్నారు. ఈ కొత్త భాగస్వా మ్యం భారత దేశంలో నెట్‌వర్క్ విస్తరణ, అధునాతన కస్టమర్ మద్దతు పట్ల స్కానియా వాహనాల హామీకి నిదర్శనంగా వుంటుందన్నారు.

మణిపూర్ విద్యార్థులకు సాయం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మణిపూర్ వెలుపల చదువుతున్న మణిపూర్ విద్యార్థులకు సంబంధించిన సమస్యలకు, ఏదైనా ఇబ్బందులు ఎదురైతే సహాయం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని న్యాయ సేవాధికార సంస్థ నందు సంప్రదించవచ్చని సభ్య కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు సంబధించి స్థానభ్రంశం, చెందిన, ఆస్థులు ధ్వంసమైన, సహాయ శిబిరాల్లో నివషించే తల్లిదండ్రులు, సంరక్షకులపై ఆధారపడిన మణిపురి విద్యార్థులు భద్రత, విద్య, నివాసం, లేద మరేదైనా సమస్యలకు సంబంధించి అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. యం.బబిత, సభ్య కార్యదర్శి , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ , అమరావతి నందు సంప్రదించవచ్చని తెలిపారు. 0866 - 2372755-60 ఫోన్ ద్వారా వివరాలను తెలుసుకోవచ్చని అన్నారు. అలాగే లవ్ అగర్వాల్, రెసిడెంట్ కమీషనర్ ఏపీ భవన్, న్యూఢిల్లీ నందు కూడా సంప్రదించవచ్చని తెలిపారు. వివరాలకు 9818 77 81 77 ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

రేపటి నుండి

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మహాత్మా కల్చరల్ ఫ్రెండ్స్ అధ్వర్యంలో ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు నగరంలో రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు మహాత్మా కల్చరల్ ఫ్రెండ్స్ ట్రెజరర్ బొప్పన కౌశలెంద్ర రావు తెలిపారు. నగరంలోని ఇందిరా గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, ప్రకాశం, ఎంసిఎఫ్ విజయవాడ జట్లు తలపడనున్నాయని తెలిపారు. లేట్ సురెడ్డి సత్యనారాయణ మెమోరియల్ పేరుతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను 8వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు జీఎస్‌టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. విలేకరుల సమావేశంలో కష్ణాజిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.బ్రహ్మాజీ రావు, జాయింట్ సెక్రటరీ కె.మురళి మోహన్,డి.దయాకర్, కె.వి.రావు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సి టెస్ట్ పేపర్స్ ఆవిష్కరణ



టెస్ట్ పేపర్స్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ప్రచురణ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్‌సి మోడల్ టెస్ట్ పేపర్స్‌ను బుధవారం నగరంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డి.ఇ.ఒ సి.వి.రేణుక మోడల్ పేపర్స్ పుస్తకాన్ని ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యస్ పి మనోహర్ కుమార్, యన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు ఏ.సుందరయ్య, జిల్లా కోశాధికారి, పి.నాగేశ్వర రావు, జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ .గోపాల్ కష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.ఇ.ఒ మాట్లాడుతూ విద్యార్థులు శ్రేయస్సు దష్టి పెట్టుకుని యుటిఎఫ్ ఆధ్వర్యంలో టెస్ట్ పేపర్స్ రూపొందించడం అభినందనీయం అని అన్నారు. యుటిఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి.మనోహర్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనుభవజ్ఞులైన టీచర్స్ చే రూపొందించబడిన యస్‌యస్‌సి టెస్ట్ పేపర్స్‌ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదరించాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ఈ టెస్ట్ పేపర్స్‌లో అన్ని సబ్జెక్ట్‌లు కవర్ చేశామని, యావరేజ్ స్థాయి విద్యార్థికి కూడా ఈ మోడల్ పేపర్స్ ఉపయుక్తంగా వున్నాయని అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో, విజయవాడ నగరంలో ఈ బుక్స్ కావాల్సిన వాళ్ళు యు టి యఫ్ విజయవాడ రాష్ట్ర కార్యాలయం లో యు టి ఎఫ్ నాయకులను సంప్రదించాలని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కె శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువులో వెనకబడ్డ విద్యార్థి పాస్ మార్కులు తెచ్చుకోవడానికి అవసరమైన విధంగా ఈ టెస్ట్ పేపర్స్ ఉన్నాయని కావున టెస్ట్ పేపర్స్‌ని తీసుకొని విద్యార్థులు చదువుకొని అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆయన జిల్లా విద్యార్థులను కోరారు.

8న జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 8వ తేదీన అనగా శుక్రవారం ఉదయం విజయవాడలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ ఆవరణలో ఏపి.స్కిల్ డెవలప్మెంట్ సంస్థ మరియు ఉపాధి కల్పన శాఖ మోడల్ కేరిర్ సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నాం అని ఈ మేళాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు పిలుపునిచ్చారు. ఈ జాబ్‌మేళాలో శ్రీరామ్ ఫైనాన్స్,ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్,సుధీర్ టింబర్ ప్రైవేట్ లిమిటెడ్,డివి మన్నోర్ (హోటల్),వరుణ్ మోటార్స్,హైటిక్ ప్రింటింగ్ కంపెనీ, యాక్సిస్ బ్యాంక్ (క్రెస్),మెడ్ ప్లస్, హెటెరో ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్, జెన్యూన్ సెక్యూరిటీ సర్వీసెస్, రమేష్ హాస్పిటల్స్ విజయవాడ, నవత ట్రాన్స్పోర్ట్, హ్యూమన్ ఫస్ట్ (H1HR) సొల్యూషన్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఎంబీఏ, డిప్లొమా చదివిన 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు లోపు నిరుద్యోగ యువత విద్యార్హత ధవ పత్రాలు జిరాక్స్, బయోడేటా ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూ కి హాజరు కావాలని తెలిపారు. ఈ ఉద్యోగ నియామకాల్లో ఎంపికైన అభ్యర్థులకు నెలకు 12000/- నుండి 30000/- వరకు వేతనం లభిస్తుంది అని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా www.ncs.gov.in వెబ్సైట్ లో తమ వివరాలను నమోదు చేసుకోగలరు అని తెలిపారు.మరిన్ని వివరాలకు 8142416211 నెంబర్ కి సంప్రదించవచ్చు అని అయన చెప్పారు.

భారత భూషణ అవార్డు ఆనందంగా ఉంది



అవార్డు చూపుతున్న సమీర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భారత భూషణ అవార్డు అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందని నేషనల్ ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ చైర్మన్ సమీర్ బుధవారం తెలిపారు. నేషనల్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ చైర్మన్ సమీర్‌కు ఢిల్లీలోని కన్స్టీట్యూషన్ క్లబ్‌లో భారత భూషణ అవార్డును అందుకున్న సందర్భంగా విజయవాడలో ఓ ప్రముఖ హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమీర్ మాట్లాడుతూ యూనియన్ మినిస్టర్ వెంకటేశన్ నేషనల్ సఫాయికర్మ చారి చైర్మన్ చేతుల మీదుగా అవార్డు అందుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. అవార్డు రావడం కోసం నాకు ఎంతగానో సహకరించి, ప్రోత్సహించిన రాందాస్ అత్వాలే సెంట్రల్ మినిస్టర్ నేషనల్ జస్టిస్ ఎంపవ ర్మెంట్‌కి జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా నేషనల్ మైనార్టీ కమిషన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పురని కలిసి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

ఎన్నికల అధికారికి వినతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : క్షేత్ర పరిశీలన చేయకుండా పశ్చిమ నియోజకవర్గంలోని ఓట్లను తొలగించడం సరికాదని, పరిశీలన అనంతరం మాత్రమే చేయాలని కోరుతూ బుధవారం టిడిపి మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పశ్చిమ నియోజకవర్గం ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ జి.ఉదయ భాస్కరరావుకి వినతి పత్రం అందజేశారు. ఫారం 6, ఫారం 7లో దరఖాస్తులలో లోపాలుంటే క్షేత్ర పరిశీలన చేయకుండా తొలగించకడంపై నివేదిక ఇవ్వాలని కోరారు. ఎన్నికల ఓట్ల జాబితా తయారీలో ఎన్నికల చట్టం, నియమావళిని పాటించాలని పశ్చిమ నియోజకవర్గ టిడిపి నాయకులు బేగ్. జిల్లా కార్యాలయం కార్యదర్శి సారిపల్లి రాధాకష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ యేదుపాటి రామయ్య, బి.కనకరావు కోరారు.



గొట్టుముక్కల అటవీప్రాంతంలో సర్వాంగ సుందరంగా జలపాతం

జలపాతం కళకళ

ప్రజాశక్తి - కంచికచర్ల : మండల పరిధిలో అటవీ ప్రాంతంలో జలపాతాలు నీటితో కళకళలాడుతున్నాయి. గొట్టుముక్కల పరిధిలో అటవీ ప్రాంతంలో మద్దులమ్మ దేవాలయం వద్ద బుధవారం ఎగువ ప్రాంతం నుండి జలపాతం దిగువకు జారటంతో ఆ ప్రాంతం చూడముచ్చటగా ఉందని యాత్రికులంటున్నారు. తెల్లటి నీటి ప్రవాహం కొండ ప్రాంతాల్లో నుండి దిగువకు జాలువారటంతో వచ్చే శబ్దాలు వినసొంపుగా ఉన్నాయని స్థానికులంటున్నారు. సినిమాలో జలపాతాన్ని తలపిస్తుందని జనం అంటున్నారు. జలపాతాన్ని తిలకించేందుకు బుధవారం గొట్టుముక్కల, కంచికచర్ల తదితర ప్రాంతాల నుండి జనం చేరుకున్నారు. మద్దులమ్మ దేవాలయం వద్ద జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయునికి మాతృవియోగం



ప్రజాశక్తి - గంపలగూడెం : ఇటీవల వరకు మండలంలోని మేడూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యునిగా పనిచేసిన గంట వెంకటస్వామి తల్లి రోజానమ్మ (70) బుధవారం మృతి చెందారు. రోజా నమ్మకు కుమారుడు, కుమార్తె. కొద్ది రోజులుగా అస్వస్థతతో బాధపడుతూ, స్వగ్రామమైన రోలుపడి గ్రామంలో మృతి చెందారు. డిపిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు బూరుగు జమలయ్య రోజానామ మృతి పట్ల సంతాపాన్ని తెలిపి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పలు ఉపా ధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యా యులు నివాళులర్పించారు.



పడవలను జాగ్రత్త చేసుకుంటున్న మత్స్యకారులు

మత్స్యకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : తుమ్మలపాలెం గ్రామంలో మత్స్యకారులకు తుఫాను ప్రభావంతో రోజు మాదిరిగా నదిలో వలలు వేశారు.అర్ధరాత్రి తుఫాను తీవ్రత ఎక్కువగా ఉన్నందున మత్స్యకారులకు జీవనాదారమైన పడవలు, వలలు కొట్టుకు పోయినందున తీవ్రంగా నష్టపోయిన పల్లెకారులను ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు ఆదుకోవాలని కోరారు. సుమారు 180 కుటుంబాల వారికి జీవనాధారమైన పడవలు వలలు కొట్టుకు పోయినందున తమను ఆదుకోవాలని సొసైటీ సభ్యులు విజయ్ కుమార్ అబ్రహం కోరారు.